క్లుప్తంగా

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



నరసరావుపేట ఈస్ట్: బొల్లు రాజేశ్వరీ కృష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామానికి చెందిన సీఏఎం ఫైనలియర్ చదువుతున్న రామినేని కావ్యరేఖకు ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బొల్లు వెంకటకృష్ణారావు మాట్లాడుతూ, ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని చదువుకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆర్థిక సహాయం అందించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బొల్లు వెంకటేశ్వర్లు, మర్లపాటి రామకృష్ణ, ప్రసాదు పాల్గొన్నారు.

నవోదయకు వినుకొండ విద్యార్థిని



వినుకొండ: ఇటీవల విడుదలైన 2024–2025 నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో పట్టణానికి చెందిన గీతమ్స్ బ్లూమ్స్ విద్యార్థిని బి. వర్షిక నవోదయకు ఎంపికైనట్లు గీతమ్స్ యాజమాన్యం తెలియజేసింది. ఈ సందర్భంగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని వర్షికకు అభినందనలు తెలియజేశారు.

వర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టుకు వాగ్దేవి విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టుకు వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.ఏసుబాబు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ రాజా మెర్సిన్‌బాబు శనివారం తెలిపారు. ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలో ఏసుబాబు ప్రతిభ కనపరిచి ఎంపికైనట్టు వివరించారు. నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 5వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో ఏసుబాబు ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్‌బాబు ఏసుబాబును అభినందించారు.

ముగిసిన ఎఎంఆర్ హ్యాక్ మానియా 2కే25



నరసరావుపేట రూరల్: ఎఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎఎంఆర్ హ్యాక్‌మానియా 2కే25 సాంకేతిక సమ్మేళనం శనివారం ముగిసింది. సాంకేతిక సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన ఈ-ప్రోగ్రామింగ్, ఇన్నోవేషన్ ఈవెంట్‌లో విద్యార్థులు సృజనాత్మకతను ప్రదర్శించేందుకు, సాంకేతిక రంగంలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. శనివారం వివిధ పోటీలతో పాటు వర్క్‌షాప్‌లు, ప్రాజెక్ట్ డెమోలు, గెమింగ్ సెషన్‌లు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈవెంట్‌ల్లో పాల్గొన్నారు. టెక్ ఎక్స్‌పోలో విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్ట్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సి.హెచ్ శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిర రంగంలో ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో ముఖ్యమని తెలిపారు. అనంతరం సమ్మేళనంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బహుమతులు సాధించిన విద్యార్థులనుకార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

వైభవంగా ఇస్కాన్ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీరాధా గోవిందుల మూలమూర్తులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయ 13వ వార్షికోత్సవం, ఉగాది వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా శనివారం బరంపేట వీధుల్లో మహానగర సంకీర్తన నిర్వహించారు. ప్రత్యేక రథంపై శ్రీరాధా గోవిందుల ఉత్సవ మూర్తులను అలంకరించి భక్తి పాటలతో నగర సంకీర్తన నిర్వహించారు. కాగా ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం 12.30గంటలకు 1008 మధుర పదార్థాలతో మహారాజభోగ నివేదన నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ నిర్వహిస్తారు.
సాయంత్రం 1008 కిలోల పుష్పాలతో మూలమూర్తులకు మహా పుష్పాభిషేకం, ఉత్సవ మూర్తులకు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. అలాగే 31వతేదీ, ఏప్రిల్ 1వతేదీ తెప్పోత్సవం నిర్వహిస్తారు.

వక్ఫ్ బోర్డు లేకుండా బాబు కుట్ర చేస్తున్నారు!

ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు మౌలాలి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ పేరుతో దేశంలో ఉన్న ఆ సంస్థ ఆస్తులు తొమ్మిది లక్షల నలభై వేల ఎకరాలు బడా బాబులకు కట్టి పెట్టేందుకు తీసుకొస్తున్న సవరణ చట్టానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక పక్క మద్దతు ఇస్తూనే ఇంకో పక్క రంజాన్ ఇఫ్తార్ విందు అంటూ చిందులు వేయడం చూస్తుంటే మరోసారి మైనార్టీలకు వెన్నుపోటు పొడుస్తున్నట్టు అర్థమవుతుందని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు ఇచ్చే ఇఫ్తార్ విందుని ఇండియన్ ముస్లిం లా బోర్డు, ఉలమా ఏ హింద్ చీఫ్ మత పెద్ద మొహమ్మద్ మధాని, ఏపీ ఎంఐఎం పార్టీ బాయ్‌కాట్ చేసిందన్నారు. ఆ విందులో వారి పార్టీ మైనార్టీ నాయకులు తప్ప ముస్లిం సంఘాలు, మత పెద్దలు ఎవరు పాల్గొనలేదని మౌలాలి స్పష్టం చేశారు. ఇప్పుడు చంద్రబాబు మాట కేంద్రం వినే అవకాశం ఉన్నా చంద్రబాబు వినియోగించుకోవడం లేదని అన్నారు. మాట వినకపోతే బీజేపీతో తెగదెంపులు చేసుకొని మైనారిటీల పక్షపాతిగా నిరూపించుకోవాలన్నారు. అవన్నీ వదిలేసి ఢిల్లీలో మద్దతు ఇస్తూ ఇక్కడికి వచ్చి ఇఫ్తార్ విందు అనడం వెనుక ముస్లింలకు ఒక్క పూట బిరియాని పడేద్దాం అనుకున్నట్టు ఉందన్నారు. మాకు రంజాన్ తోఫా, ఇఫ్తార్, ఇస్తాను అన్న పథకాలు వద్దుని, తమకు వక్ఫ్ స్థలాలు కాపాడటమే ముఖ్యమని అన్నారు.

టీఈసీలో 58 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన ఆల్సెక్ టెక్నాలజీస్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 58 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు వివిధ బ్రాంచ్‌లు నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 58 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు రూ.2.40 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

తాగునీటి చెరువులో నీటి నిల్వ పరిశీలన


గణపవరం తాగునీటి చెరువులో నీటినిల్వలు పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ అధికారులు

నాదెండ్ల: గణపవరం రక్షిత మంచినీటి చెరువులో నీటి నిల్వలను ఎన్ఎస్‌పీ అధికారులు, సచివాలయ సిబ్బంది శనివారం పరిశీలించారు. చెరువు పూర్తిగా అడుగంటటంతో ఈ నెల 22, 23, 24 తేదీల్లో సాగర్ జలాలతో నింపారు. అయితే కేవలం 20 శాతం మాత్రమే చెరువు నిండింది. ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు ఏప్రియల్ చివరి వరకూ మాత్రమే తాగునీటి అవసరాలకు సరిపోతాయి. ప్రస్తుతం సాగర్‌జలాలు వారాబందీ ద్వారా విడుదలౌతున్న నేపథ్యంలో కొందరు రైతులు పంటపొలాలకు మళ్లించుకుంటున్నందున పహారా కాస్తున్నట్లు ఎన్ఎస్‌పీ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఏప్రిల్ చివరిలో మరోసారి సాగర్ జలాలు విడుదల చేయనున్న నేపథ్యంలో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నింపనున్నట్లు అధికారులు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పనిచేయని బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలు

నాదెండ్ల: గణపవరం ఒకటో సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సెంటర్ ద్వారా కార్డు అప్‌డేట్ సేవలందించారు. అయితే సర్వర్ల మొరాయింపుతో బయోమెట్రిక్ పనిచేయకపోవటంతో కార్డుదారులకు అవస్థలు తప్పలేదు. శనివారం ఇరవై మూడు కార్డులకు మించి అప్‌డేట్ చేయలేదు. సచివాలయంలోని బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలు సరిగా పనిచేయకపోవటంతో ఆధార్ ప్రక్రియ నత్తనడకన సాగింది.

పోక్సో చట్టంతో బాలలకు భద్రత

- చిలకలూరిపేట మండల సేవా అధికార సంస్థ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి
- పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న కె.నరేందర్‌రెడ్డి

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామ సచివాలయంలో శనివారం పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చిలకలూరిపేట మండల సేవా అధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. సదస్సులో పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ ఆఫెన్సెస్) చట్టం–2012పై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలపై లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల నివారణ, బాధితుల గోప్యతను పాటించడం, ఈ చట్టంలోని శిక్ష నిబంధనలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి. వెంకటేశ్వర రావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, టి.రామాంజనేయులు, ఎం.భానుప్రసాద్, పారా లీగల్ వలంటీర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఏటీఎం, పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు హర్షణీయం

నాదెండ్ల: ఎస్సీలు నివాసం ఉండే ప్రాంతాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, మౌలిక వసతులకు రాష్ట్రంలో 40 శాతం పైగా నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ముందుకురావటం హర్షణీయమని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. సాతులూరు ఎస్సీ కాలనీలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలు నివసించే 1027 గ్రామాల్లో ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం, ఉపాధి హామీ పథకం నిధులతో ఒక్కో గ్రామంలో రూ.60–70 లక్షలు ఖర్చుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో తాటిగిరి జయరావు, శేషు, సంకూరి దేవరాజు, కిరణ్, విప్పర్ల చంటి, కె ప్రకాశరావు ఉన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణ మేళా


రుణమేళాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీసీ కార్పొరేషన్ రుణ మేళ నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రుణ మేళాకు హాజరయ్యారు. నరసరావుపేట ఇండియన్ బ్యాంక్, ఉప్పలపాడు, జొన్నలగడ్డ చైతన్య గోదావరి బ్యాంక్, రావిపాడు యూనియన్ బ్యాంక్, పమిడిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను స్వీకరించారు.
రుణ మేళాలో 240 దరఖాస్తులు అధికారులకు అందాయి. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించి స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా వెనుకబడిన తరగతులు, కాపు, ఇతర కులాల వారికి రుణ మేళా నిర్వహించినట్టు ఎంపీడీవో టీవీ కృష్ణ కుమారి తెలిపారు. ఈవోపీఆర్‌డీ నాగానంద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది రుణ మేళాలో పాల్గొన్నారు.

పేదలకు దానధర్మాలు చేయాలి

చిలకలూరిపేట: రంజాన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పేదలకు దానధర్మాలు చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. జనక్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్, జీఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు అందరూ రంజాన్ మాసంలో తమ సంపాదనలో కొంత భాగం పేదలకు పంపిణీ చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నేడు సాతులూరులో ఉగాది వేడుకలు


ప్రత్యేక అలంకరణలో ఆలయం

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం ఉగాది సందర్భంగా తిరునాళ్ళ జరగనుంది. ఆలయాన్ని రూ.2 కోట్ల వ్యయంతో పునర్నిర్మించి ఈ నెల 17న పునః ప్రతిష్ట నిర్వహించిన విషయం విదితమే. సుమారు రెండు శతాబ్దాల చరిత్ర గలిగిన ఆలయం వద్ద తెలుగు నూతన సంవత్సరాది విశ్వావసు ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకోనున్నారు. రెండో రోజుల సోమవారం విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది ఏప్రియల్ 1వ తేదీన ఆలయ పదహారు రోజుల పండుగ రావటంతో విద్యుత్ ప్రభలు ఏర్పాటు కానున్నాయి. భక్తుల సౌకర్యార్థం బారికేడ్లు ఏర్పాటు చేశారు.

తుది దశకు చేరిన కొత్తలూరు రీసర్వే

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో చేపట్టిన రీసర్వే పనులు తుది దశకు చేరినట్లు తహసీల్దారు కె.సుజాత అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ కొత్తలూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 4412 ఎకరాలు భూములు ఉండగా అందులో 695 ఎకరాలు ప్రభుత్వ భూమి, 3717 ఎకరాలు పట్టాభూమిగా నిర్ధారణ చేసినట్లు తెలిపారు. రీసర్వే పనులకు సంబంధించి 3100 మంది రైతులకు నోటీసులు అందజేశామన్నారు.

వెనుకబడిన పల్నాడును ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- రైతు సేవా కేంద్రాల ద్వారా ఏ సేవలు అందిస్తున్నారో చెప్పండి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు


సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: అన్ని విధాల వెనుకబడిన పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. శనివారం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ నెల చివరి వరకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ఆదుకుంటామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం విధి విధానాలు రూపొందించ లేదన్నారు. మిర్చికి రూ.25 వేలు, కందులు, మినుములు, ఇతర అపరాలకు మద్దతు ధర ప్రకటించి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకుండానే బనకచర్లతో పాటు 100 గ్రామాలకు తాగునీరు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వరికపూడిశెల నిర్మిస్తామని చెబుతున్నారని, కేంద్ర అటవీ శాఖ అనుమతులకు చెల్లించాల్సిన రూ.14 కోట్లను చెల్లించి వరికపూడిశెలకు రూ.1500 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. అక్షరాస్యతపరంగా వెనుకబడిన పల్నాడు జిల్లాలో ప్రభుత్వ రంగంలో యూనివర్సిటీ నియోజకవర్గానికి ఒక డిగ్రీ కాలేజీ ప్రతి మండలానికి ఒక జూనియర్ కాలేజీ నిర్మించాలని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఏ సేవలు చేస్తున్నారని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ ఆయకట్టు కింద లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని మూడేళ్లుగా సాగునీరు సక్రమంగా ఇవ్వక పోవడంతో వరిసాగు చేపట్టని రైతులు ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసిన నేపథ్యంలో ఖరీఫ్ రబీలో వరిసాగు చేశారన్నారు.
మిర్చి, మొక్కజొన్న పంటలు చేతికి రావాలంటే ఏప్రిల్ చివరి వరకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఒకవైపు మిర్చికి తెగుళ్ల బెడద, ధరలు లేమితో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉంటే కనీసం సాగునీరు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వాలు వ్యవహరించడం తగదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై సీపీఐ ఆందోళన



ప్రచార ఆందోళనలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి మార్చి 23 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వతేదీ వరకు చేపట్టిన ప్రచార ఆందోళన కార్యక్రమంలో భాగంగా శనివారం బాబాపేటలో ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి సత్యనారాయణరాజు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయన్నారు. ప్రధాని మోడీ, కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారని విమర్శించారు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులో లేకుండా చేశారని తెలిపారు. రైతులు, కార్మికులు, ప్రజలు ప్రజా వ్యతిరేక పాలకులపై సీపీఐ నిర్వహిస్తున్న పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, షేక్. చినజాన్ సైదా, జంగా అంకమ్మరావు, అరుణ్‌జోజి పాల్గొన్నారు.

ఆటో బోల్తా - ఇరువురికి గాయాలు


బోల్తాపడిన ఆటోలో నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం కుప్పగంజి వాగు బ్రిడ్జిపై ఆటో బోల్తాపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న కారు ఆగటంతో వెనుక వస్తున్న ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న గణవపరం గ్రామానికి చెందిన డ్రైవర్ నాగేశ్వరరావు, అతని మిత్రుడిని స్థానికులు ఆటో నుంచి వెలుపలికి తీశారు. అయితే ఇరువురికీ స్వల్పగాయాలు మాత్రమే అయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను స్థానికులు ప్రశ్నించేలోపే అక్కడి నుండి వెళ్లిపోవటం విశేషం.

సంక్షిప్త వార్తలు

మీసేవా కేంద్రం తనిఖీ

నూజెండ్ల: గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం అందించే వివిధ రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అధిక రుసుము వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీవో మూలె వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన నూజెండ్ల గ్రామంలో ఉన్న మీసేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ ఫిర్యాదుల విభాగానికి (ఐఆర్ఎస్) నుంచి స్థానిక మీసేవా కేంద్రంలో నిర్దేశించిన ధరలు కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు ప్రజల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో అధికారుల ఆదేశాలు మేరకు తనిఖీ చేశామన్నారు.

ఈకేవైసీ నమోదు నూరుశాతం చేయాలి

శావల్యాపురం: రేషన్ కార్డుదారులందరు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించాలని తహసీల్దారు కె.సుజాత అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో యండీఎం వాహనదారులు, రేషన్ డీలర్లుకు ఈకేవైసీ బయోమెట్రిక్ నమోదు పురోగతిపై సమావేశం నిర్వహించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 32.566 మంది రేషన్ లబ్ధి పొందుతుండగా ఇందుకుగాను ఇప్పటి వరకు 29.349 మంది ఈకేవైసీ నమోదు చేసినట్లు తెలిపారు.

ఉగాది సంబరాలు

నూజెండ్ల: మండలంలోని పెద్దావరం గ్రామం ఎంపీపీ స్కూల్లో ఉగాది సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలను తోరణాలు పూలతో అలంకరణ చేశారు. మామిడి తురుము, వేప పువ్వు, కొత్త బెల్లం, చింతపండు, ఉప్పు, కారం కలిపి ఉగాది పచ్చడి చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఘంటా నాగేశ్వరరావు, సీఆర్‌పీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన సంవత్సరం విశ్వవసు నామ సంవత్సరంలో విశిష్టత వివరించారు.